సాక్షి
తూర్పుగోదావరి


శనివారం । 23 । మార్చి । 2024



హోలీ.. ఆనంద కేళి

పిల్లలకు ఆనందాలను పంచే రంగుల పండగ.. హోలీ నిర్వహించుకునే వేళ పలు జాగ్రత్తలు తీసుకోవడం మేలు అని వైద్యులు సూచిస్తున్నారు.

- IIలో



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శని (సా॥)	సెహరీ ఆది (ఉ॥)
రాజమహేంద్రవరం	6.23	4.43
కాకినాడ	6.24	4.43
అమలాపురం	6.24	4.43

న్యూస్‌రీల్

విగ్రహం మూశారు.. గుర్తు మరిచారు



రాజమహేంద్రవరం రూరల్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు నేపథ్యంలో ఎన్నికల యంత్రాంగం కొన్నిచోట్ల విచిత్ర విన్యాసాలు చేస్తోంది. శాటిలైట్ సిటీ గ్రామంలోని సి–బ్లాక్ మోడల్ హౌస్ సమీపాన బీజేపీకి చెందిన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పాయ్ విగ్రహానికి ఎన్నికల అధికారులు ముసుగు వేశారు. కానీ, దాని దిగువన ఉన్న ఆ పార్టీకి చెందిన కమలం గుర్తును మాత్రం వదిలేశారు. దీనిపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు కమలం గుర్తును మూసివేయాలని పలు పార్టీల నేతలు కోరుతున్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి



పోస్టల్ బ్యాలెట్ శిక్షణలో మాట్లాడుతున్న జేసీ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం సిటీ: రానున్న ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ కోరారు. పోస్టల్ బ్యాలెట్‌పై విద్యా శాఖ, ఇతర అధికారులకు, ప్రధానోపాధ్యాయులకు కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములయ్యే అధికారులకు, సిబ్బంది, ఇతర విధుల్లో భాగస్వాములయ్యే వారికి ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించిందన్నారు. పోస్టల్ బ్యాలెట్లపై పోలింగ్ అధికారులందరికీ పూర్తి అవగాహన ఉండాలని చెప్పారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే వారి నుంచి ఫారం–12డి (ఆబ్సెంటీ ఓటర్ వివరాలు) ద్వారా అంగీకారం స్వీకరించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ఓట్లను స్వీకరించిన అనంతరం ఆయా నియోజకవర్గాలకు పంపిస్తారని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌పై ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల్లోని టీచర్లకు పూర్తి అవగాహన కల్పించాలని జేసీ తేజ్‌భరత్ సూచించారు. కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు వైకేవీ అప్పారావు, బి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రబీ ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు

రాజమహేంద్రవరం సిటీ: జిల్లావ్యాప్తంగా 231 రైతుభరోసా కేంద్రాల ద్వారా వచ్చే నెల 1 నుంచి రబీ ధాన్యం కొనుగోళ్లు చేసేందుకు ఏర్పాట్లు చేశామని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ తెలిపారు. కలెక్టరేట్‌లో క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా కొనుగోలు కేంద్రాలకు నిర్దేశించిన ధాన్యం సేకరణకు 50 శాతం గోనెసంచులను ముందుగానే సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు సమయంలో వ్యవసాయ అధికారులు వరి కోతలను పర్యవేక్షించి, మార్గదర్శకాల మేరకు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రస్తుత సీజన్‌లో 3.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. జిల్లాలో 18 మండల స్థాయి సేకరణ కమిటీల ద్వారా 142 ధాన్యం మిల్లులను గుర్తించి, వాటికి కస్టోడియన్ అధికారులను నియమించామని జేసీ తేజ్‌భరత్ వివరించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాలు, వ్యవసాయ, రవాణా శాఖల అధికారులు పి.విజయ భాస్కర్, ఎస్.మాధవరావు, కేవీ కృష్ణారావు, మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.సునీల్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

28న జెడ్పీ 'స్థాయీ' సమావేశాలు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు ఈ నెల 28వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్నామని సీఈఓ ఎ.శ్రీరామచంద్రమూర్తి శుక్రవారం తెలిపారు. పంచాయతీ రాజ్ చట్టం నిబంధనలకు, ఎన్నికల నియమావళికి లోబడి 1 నుంచి 7 వరకూ ఉన్న స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించనున్నామని వివరించారు. ఈ సమావేశానికి సంబంధిత స్థాయీ సంఘాల సభ్యులు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

● చంద్రన్న దెబ్బ!

చౌదరిగారికి పరాభవం


- టీడీపీ మూడో జాబితాలోనూ బొడ్డు వెంకట రమణ చౌదరి పేరు నిల్
- ఎంపీ స్థానంపై ఆశలు గల్లంతేనా!
- ఇప్పటికే చేజారిన రాజానగరం సీటు
- లోక్‌సభ బరిలో పురంధేశ్వరిని దింపేందుకు తాజాగా కమలనాథుల కసరత్తు
- అదే జరిగితే చౌదరి రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకమే
- చంద్రబాబు నిర్ణయంపై ఆయన వర్గంలో పెరుగుతున్న ఆగ్రహం

సాక్షి, రాజమహేంద్రవరం: రాజానగరం అభ్యర్థిత్వం చేజారిన టీడీపీ నేత బొడ్డు వెంకట రమణ చౌదరికి మళ్లీ భంగపాటు తప్పదా? రాజమహేంద్రవరం ఎంపీ స్థానం ఆశిస్తున్న ఆయనకు.. టీడీపీ, జనసేన బీజేపీ కూటమితో ఆశలు గల్లంతైనట్లేనా? కూటమి అభ్యర్థిగా దగ్గుబాటి పురంధేశ్వరిని రంగంలోకి దింపేందుకు కమలనాథులు పావులు కదుపుతున్నారా? ఈ పరిణామంతో చౌదరికి మరోసారి పరాభవం ఎదురు కానుందా? టీడీపీ మూడో జాబితాలో ఆయన పేరు లేకపోవడం ఇందుకు బలాన్ని చేకూరుస్తోందా? అంటే అవుననే సమాధానం వస్తోంది రాజకీయ విశ్లేషకుల నుంచి.

రెంటికీ చెడ్డ రేవడిలా..

తన పనితీరుపై అధినేత చంద్రబాబు విరుచుకుపడటంతో రాజానగరం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ నియోజకవర్గ ఇన్‌చార్జి పదవికి చాన్నాళ్ల కిందటే గుడ్‌బై చెప్పేశారు. అప్పటి నుంచీ ఆ బాధ్యతలను బొడ్డు వెంకట రమణ చౌదరికి చంద్రబాబు అప్పగించారు. ఆయనే రాజానగరం ఎమ్మెల్యే అభ్యర్థి అనే ప్రచారం విస్తృతంగా సాగింది. అంతలోనే ఆయన ఆశలపై పొత్తుల పిడుగు పడింది. జనసేనతో టీడీపీ పొత్తు కుదుర్చుకోవడం.. రాజానగరంలో జనసేన పోటీ చేస్తుందని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించడంతో చౌదరి వర్గంలో ఒక్కసారిగా ప్రకంపనలు రేగాయి. ఈ పరిణామం చౌదరికి మింగుడు పడని అంశంగా మారింది. ఒక దశలో ఇది చంద్రబాబుపై ధిక్కార స్వరం వినిపించే స్థాయికి చేరింది. కొద్ది రోజుల కిందట జిల్లా పర్యటనకు వచ్చిన చంద్రబాబును అడ్డుకోవడం వరకూ వెళ్లింది. ఆ సమయంలో చౌదరిని బుజ్జగించేందుకు చంద్రబాబు టక్కుటమార గజకర్ణ గోకర్ణ విద్యలన్నీ ప్రదర్శించారు. రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పిస్తానంటూ భరోసా ఇచ్చారు. అందుకు ససేమిరా అన్నప్పటికీ చేసేది లేక చౌదరి మిన్నకుండిపోయారు. అప్పటి నుంచీ టీడీపీ కార్యక్రమాల్లో అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

పార్టీ కోసం.. చంద్రబాబు పర్యటనల కోసం ఇప్పటికే కోట్లాది రూపాయల చేతి చమురు వదిలిపోయింది.. మూతికి కర్రతో గడ్డి కట్టి, ఆశ చూపించి, పరుగులు పెట్టించినట్టు.. ఎమ్మెల్యే సీటు ఇస్తామంటూ ఆశ చూపారు. ఆ మాటలు కాస్తా నమ్మి పార్టీ కోసం కోట్ల రూపాయలు ఖర్చు పెట్టేశారు. కొన్నాళ్లు పోయాక.. అబ్బెబ్బే.. అది కాదు.. ఎంపీ సీటు అన్నారు. తీరా చూస్తే పొత్తులతో ఆ ఆశ కాస్తా చిత్తయిపోతున్న చిత్రం కళ్ల ముందు స్పష్టంగా కనిపిస్తోంది. మొత్తంమీద చంద్రబాబు జిత్తులతో దిమ్మ తిరిగి బొమ్మ కనిపిస్తున్నట్టుగా ఉంది టీడీపీ రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి పరిస్థితి. తాజాగా శుక్రవారం విడుదల చేసిన మూడో జాబితాలో కూడా చౌదరి పేరు లేకపోవడంతో.. ఈ పరాభవాన్ని ఎలా సహించాలంటూ ఆయనతో పాటు ఆయన వర్గం అగ్గిమీద గుగ్గిలంలా మండిపడుతోంది. వ్రతం చెడ్డా ఫలితం కూడా దక్కలేదంటూ ఆక్రోశిస్తోంది.



బొడ్డు వెంకట రమణ చౌదరి

నియోజకవర్గంలో సైతం పెద్దగా కనిపించడం లేదు. ఆయన వర్గం సైతం అదే పంథా అవలంబిస్తోంది. తనకు ఎంపీ సీటు కేటాయిస్తారులే అనే ఆశతో ఇష్టం లేకపోయినా.. జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణకు మద్దతు తెలపాల్సిన పరిస్థితి చౌదరికి ఏర్పడింది. ఈ పరిణామాల నేపథ్యంలో టీడీపీ తాజాగా ప్రకటించిన మూడో జాబితాలో సైతం **ఆయన పేరు లేకపోవడంతో ఎంపీ సీటు కూడా గోవిందానేనా? అనే అనుమానం చౌదరి వర్గీయుల్లో వ్యక్తమవుతోంది.**

కలవరం రేపుతున్న కూటమి

ఎమ్మెల్యే సీటు ఎటూ దక్కలేదు.. కనీసం ఎంపీగా అయినా అవకాశం వస్తుందని భావిస్తున్న చౌదరి వర్గానికి.. చంద్రబాబు బీజేపీతో కలవడం కొత్త టెన్షన్ తెచ్చిపెడుతోంది. ఇప్పటికే ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి రాజమహేంద్రవరం ఎంపీ సీటు ఆశిస్తున్న విషయం తెలిసిందే. ఆమెను ఎన్నికల బరిలోకి దింపేందుకు కమలనాథులు వ్యూహాలు రచిస్తున్నారు. పొత్తులో భాగంగా రాజమహేంద్రవరం స్థానాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే కొందరు నేతలు నగరంలోని ఓ హోటల్‌లో కొద్ది రోజులుగా బస చేస్తున్నట్లు తెలిసింది. పురంధేశ్వరి పోటీ చేస్తే అనుసరించాల్సిన వ్యూహాలు, సాధ్యాసాధ్యాలపై వారు సమాలోచనలు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇటువంటి పరిస్థితుల్లో పురంధేశ్వరి పోటీ దాదాపు ఖాయమన్న విషయం స్పష్టమవుతోంది. ఇదే తరుణంలో ప్రస్తుతం ఉన్న కేసుల దృష్ట్యా బీజేపీ కోరుకుంటున్న ఈ లోక్‌సభ స్థానాన్ని కాదనే ధైర్యం చంద్రబాబు చేయరు. ఈ పరిణామాలు చౌదరి వర్గంలో ఆందోళన రేపుతోంది. ఎంపీ అవకాశం కూడా లేనట్లేనా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇలాగైతే తన రాజకీయ భవిష్యత్తు ఏమిటనే మీమాంస ఆయన వర్గంలో బలంగా కనిపిస్తోంది. పార్టీని నమ్ముకుంటే నట్టేట మునిగేలా ఉన్నారన్న భావన వ్యక్తమవుతోంది.

రూ.కోట్లు ధారబోసినా కరివేపాకు రాజకీయమేనా!

బీజేపీ నేతలతో చంద్రబాబు కాళ్లబేరానికి వెళ్లడం టీడీపీ నేతలకు తిప్పలు తెచ్చి పెడుతోంది. ఇప్పటికే జనసేనతో జత కట్టడంపై గుర్రుగా ఉన్న తెలుగు తమ్ముళ్లు తాజాగా బీజేపీతో కలవడంపై మరింత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెంకట రమణ చౌదరి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలు నిర్వహిస్తున్నారు. చినబాబు లోకేష్‌కు సంబంధించిన సోషల్ మీడియా మొత్తం ఆయనే చూస్తున్నారు. చంద్రబాబు ఎక్కడ పర్యటించినా పబ్లిసిటీ చేసేందుకు సహకరిస్తున్నారు. ఇదే తరుణంలో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. పార్టీ బలోపేతం, పటిష్టతకు ఇంత చేస్తున్నా తనకు తగిన గుర్తింపు ఇవ్వడం లేదనే అభిప్రాయం చౌదరి వర్గంలో వ్యక్తమవుతోంది. తన విషయంలో కూడా చంద్రబాబు కరివేపాకు మాదిరిగా వాడుకుని వదిలేసే రాజకీయాలకు తెర తీయడంపై మండిపడుతున్నారు.

లోహిత్‌నూ వాడేసుకున్నారు

ఎన్ఆర్ఐలు, డబ్బున్న నేతలు, సమాజంలో పలుకుబడి ఉన్న వ్యక్తులను వాడుకుని వదిలేయడంలో చంద్రబాబుది అందె వేసిన చేయి. ఇందుకు నిదర్శనమే శిష్టా లోహిత్. ఎంపీ స్థానం కేటాయిస్తామనే ఆశ కల్పించి, ఎన్ఆర్ఐ అయిన లోహిత్‌ను రాజమహేంద్రవరంలో పరిచయం చేశారు. ఆర్థికపరమైన పార్టీ కార్యక్రమాలకు ఆయనను విస్తృతంగా వినియోగించుకున్నారు. ఆయనను ఏ స్థాయిలో వాడేసుకున్నారంటే.. రాజమహేంద్రవరంలో మహానాడు నిర్వహణకు ఒక్కో నియోజకవర్గానికి రూ.25 లక్షల చొప్పున మొత్తం రూ.1.75 కోట్లు వసూలు చేసినట్లు సమాచారం. అలా లోహిత్ ఇచ్చిన డబ్బుతోనే మహానాడుకు పెద్ద పెద్ద ఫ్లెక్సీలు వేసేశారు. అందులో లోహిత్‌కు తగిన గుర్తింపు ఇచ్చిన పాపాన పోలేదు. చివరకు సీటు తనకు కాదని చావు కబురు చల్లగా చెప్పేశారు. దీంతో చేసేది లేక లోహిత్ ఇక్కడి నుంచి దుకాణం సర్దుకోవాల్సి వచ్చింది. ఇదేవిధంగా రాజమహేంద్రవరం పార్లమెంటరీ స్థానాన్ని పురంధేశ్వరికి కేటాయిస్తే వెంకట రమణ చౌదరి సైతం దుకాణం ఎత్తేయాల్సిన పరిస్థితి తలెత్తుతుందని ఆయన వర్గంలో చర్చ జరుగుతోంది.

నిర్మలగిరి.. భక్తజన సిరి

- గౌరీపట్నం మేరీ మాత ఉత్సవాలు ప్రారంభం
- 25 వరకూ నిర్వహణ

దేవరపల్లి: గౌరీపట్నంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను ఏలూరు కథోలిక్ పీఠాధిపతి, విశాఖపట్నం అగ్రపీఠం పరిపాలనాధికారి రెవరెండ్ జయరావు పొలిమెర ప్రారంభించారు. ఈ నెల 25వ తేదీ వరకూ జరగనున్న ఈ ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. చివరి రెండు రోజులు భక్తులు మరింతగా వస్తారని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. తొలి రోజున పశ్చిమ గోదావరి, ఏలూరు, తూర్పు గోదావరి జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి మరియ తల్లి మండపంలో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా జయరావు మాట్లాడుతూ, నిర్మలగిరి ప్రముఖ పుణ్యక్షేత్రంగా దినదినాభివృద్ధి చెందిందని, ఇక్కడి మేరీ మాతను కేవలం క్రైస్తవులే కాకుండా ప్రజలందరూ కొలుస్తున్నారని అన్నారు. ఏటా మార్చి 22 నుంచి 25వ తేదీ వరకూ ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నాలుగు రోజుల ఉత్సవాల్లో లక్షలాదిగా భక్తులు కులమత వర్గాలకు అతీతంగా తరలివచ్చి మరియ తల్లి, ఏసుక్రీస్తును పూజించడం విశేషమని అన్నారు. భారతదేశం శాంతికి, సహనానికి చిహ్నంగా ఉండాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నామని చెప్పారు. అందరి సహకారంతో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులకు



నిర్మలగిరి క్షేత్రంలో భక్తుల సందడి

ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. కలవరి కొండపై ఉన్న ఏసుప్రభువును దర్శించుకోవడానికి, మరియ తల్లికి తమ కోర్కెలను విన్నవించుకోవడానికి ప్రతి శని, ఆదివారాల్లో భక్తులు మోకాళ్లపై ఇసుకలో నడుస్తూ రావడం తనను ఎంతో ఆనందింపజేస్తోందని చెప్పారు. ఏలూరు డెంటల్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్ మాట్లాడుతూ, ఈ నెల 24, 25 తేదీల్లో సెలవులు రావడంతో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నామన్నారు. సుమారు 6 లక్షల మంది భక్తులు రానున్నట్టు అంచనా వేస్తున్నామన్నారు. ప్రతి రోజూ సాయంత్రం దివ్యబలి పూజ జరుగుతుందని తెలిపారు. ఈ ఉత్సవాలకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో కథోలిక్ ఫాదర్లు బాల, ఇమాని యేలు, ఫెరిక్స్, ధర్మరాజు, పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ ఎస్.జాన్‌పీటర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు ముగిసిన శిక్షణ



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న రిజిస్ట్రార్ సుధాకర్, ప్రిన్సిపాల్ రామచంద్రరావు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): నూతన విద్యా విధానాన్ని అనుసరించి వాణిజ్య శాస్త్రంలో సరికొత్త బోధనా పద్ధతులపై వాణిజ్య శాస్త్ర అధ్యాపకులకు ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. దీనికి రాజమహేంద్రవరం, కాకినాడ నోడల్ రీసోర్స్ కేంద్రం పరిధిలోని 19 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు హాజరయ్యారు. ముగింపు సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఎ.సుధాకర్ మాట్లాడుతూ, 21వ శతాబ్దపు ఉద్యోగ మార్కెట్‌కు కావాల్సిన నైపుణ్యాలను ప్రతి విద్యార్థీ అలవరచుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ, ఇటువంటి శిక్షణలు జాతీయ నూతన విద్యా విధానాన్ని అధ్యాపకులు అవగాహన చేసుకోవడానికి, విద్యార్థుల ఉన్నతికి సహకరిస్తాయని అన్నారు. కార్యక్రమంలో నాలెడ్జ్ రీసోర్స్ పర్సన్లు డాక్టర్ కె.ప్రతిమ, ఆర్‌డీ శిరీషరెడ్డి, సమన్వయకర్త డాక్టర్ ఏపీ అన్నపూర్ణ, వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి సత్యనారాయణ, నోడల్ రీసోర్స్ కేంద్రం సమన్వయకర్త సంజీవ్ కుమార్ పాల్గొన్నారు.

బాధ్యతగా వ్యవహరించాలి

- నిబంధనల ఉల్లంఘన జరగకుండా చూడాలి
- రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్ ఆదేశం

రాజమహేంద్రవరం సిటీ: విధి నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు పూర్తి బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత ఆదేశించారు. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపు వంటి అంశాలపై బూత్ స్థాయి అధికారిపై ఆధారపడకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలించడం ద్వారా వ్యక్తిగతంగా నిర్ధారించుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల అధికారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ప్రతి రోజూ వచ్చిన దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలన్నారు. ఫారం–6కు సంబంధించి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని చెప్పారు. తుది ఓటర్ల జాబితా ప్రకటించిన అనంతరం ఫారం–7కు సంబంధించి 15,185 దరఖాస్తులు రాగా, వాటిలో 12,825 ఆమోదించామని, 2,360 పరిశీలనలో ఉన్నాయని వివరించారు. అభ్యర్థులతో పాటు రాజకీయ పార్టీల తరఫున వ్యక్తిగతంగా ఎటువంటి ఎన్నికల ప్రచారం చేసినా సువిధ యాప్ ద్వారా అనుమతులు పొందడం తప్పనిసరని స్పష్టం చేశారు. ఎన్నికల విధులు సజావుగా నిర్వర్తించడం, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేలా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

నగదు, వస్తు పంపిణీ వంటి వాటిని అరికట్టేందుకు ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల మధ్య సమన్వయం సాధించాలని సూచించారు. వాటి వివరాలను ఎప్పటికప్పుడు వీడియో రికార్డింగ్ చేస్తూ, వెంటనే నివేదికలు పంపాలని చెప్పారు. నియోజకవర్గ స్థాయిలో కంట్రోల్ రూము ఏర్పాటు, సోషల్ మీడియాలో వచ్చే ప్రచార అంశాల వంటి వాటిపై ప్రత్యేక సిబ్బందిని నియమించి పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. నిబంధనల ఉల్లంఘన జరగకుండా, హింసకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. సమావేశంలో రూరల్ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, డీఆర్‌ఓ జి.నరసింహులు, పార్లమెంటరీ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి ఆర్.కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలే డ్రగ్స్ డాన్లు

- విశాఖ పోర్టులో పట్టుబడిన కొకైనే దీనికి సాక్ష్యం
- ఆ చౌదరీలిద్దరూ టీడీపీ నేతలకు అత్యంత సన్నిహితులే
- ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల చీకటి వ్యాపారానికి టీడీపీ నేతలే డాన్లుగా వ్యవహరిస్తున్నారని, విశాఖ పోర్టు సంఘటనతో ఈ విషయం స్పష్టమైందని రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ ధ్వజమెత్తారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విశాఖ పోర్టులో 25 వేల కిలోల డ్రై ఈస్ట్‌తో కొకైన్ పట్టుబడిన కేసులో కూనం కోటయ్య చౌదరి, కూనం వీరభద్రరావు కీలకమని తెలుస్తోందన్నారు. సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ పేరిట ఈ కొకైన్ డెలివరీ అయినట్లు అధికారులు గుర్తించారన్నారు. ఆ కంపెనీ కోటయ్య చౌదరి, వీరభద్రరావులదేనన్నారు. వీరిద్దరూ టీడీపీ నేత లోకేష్‌కు, బాలకృష్ణ వియ్యంకుడికి అత్యంత సన్నిహితులని పేర్కొన్నారు. రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాలు ఏరులై పారుతున్నాయని, అక్రమ వ్యాపారాలకు వైఎస్సార్ సీపీ



ఆదిరెడ్డి వాసుతో గంజాయి నిందితులు ఉన్న ఫొటో చూపుతున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

ప్రభుత్వమే కారణమని తప్పుడు ఆరోపణలు చేస్తున్న టీడీపీ పెద్దలు దీనికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

ఆ నిందితులు.. వాసు సన్నిహితులు

హైదరాబాద్ గంజాయి కేసులో అడ్డంగా దొరికి జైలు పాలైన రాజమహేంద్రవరానికి చెందిన జాకీ, చోటు తదితరులు టీడీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి వాసుకు అత్యంత సన్నిహితులేనని ఎంపీ భరత్‌రామ్ అన్నారు. వారిద్దరూ వాసుతో దిగిన ఫొటోలను ప్రదర్శించారు. గంజాయి మాఫియాకు డాన్‌గా వాసు వ్యవహరిస్తున్నారని, ఇటువంటి వారు రాజకీయాల్లోకి రావడం అత్యంత ప్రమాదకరమని భరత్‌రామ్ అన్నారు. ఒక పోలీసు అధికారికి ఆదిరెడ్డి వాసు ఫోన్ చేసి మాట్లాడిన ఆడియో రికార్డును తన అఫీషియల్ ఫేస్‌బుక్‌లో పెట్టడం కూడా నేరమేనన్నారు. విధుల్లో ఉన్న ఒక పోలీసు అధికారితో మాట్లాడి, ఆయన అనుమతి లేకుండా ఫేస్‌బుక్‌లో పెట్టడం రాజద్రోహం కిందకు వస్తుందన్నారు. దీనిని ఐపీసీ 54, 353, 123 ప్రకారం తీవ్ర నేరంగా పరిగణించవచ్చునని తెలిపారు. దీనిపై తెలంగాణ డీజీపీకి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఒక ఎంపీగా ఈ ఐదేళ్లలో నగరంలో తాను చేసిన అభివృద్ధిని తాను ప్రజలకు చెప్పుకోవడం కూడా ఆదిరెడ్డి అప్పారావు, వాసులకు నేరంగా కనిపిస్తోందని, దీనిపై ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయడం విచిత్రంగా ఉందని అన్నారు.

నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా..

ఆదిరెడ్డి కుటుంబం 16 సంవత్సరాలు మేయర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేగా అధికారాలను వెలగబెట్టినా నగరానికి గానీ, ప్రజలకు గానీ ఒక్క మంచి పని కూడా చేయలేదని భరత్‌రామ్ అన్నారు. కమీషన్లు తీసుకుంటున్నట్టు ఆరోపిస్తున్నారని, అర శాతం తీసుకున్నానని నిరూపించినా రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని ప్రకటించారు. నగరంలో ఏం అభివృద్ధి చేశానో 20కి పైగా చెబుతానని, టీడీపీ, ఆదిరెడ్డి కుటుంబం ఏం చేసిందో చెప్పాలని సవాల్ విసిరారు. టీడీపీ నాయకులు మొదటి నుంచీ వలంటీర్లు అంటే ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. రాజకీయంగా తనను ఎదుర్కోలేక ఆడపిల్లలైన వలంటీర్లపై ప్రతాపం చూపడం సరి కాదన్నారు.

వలంటీర్ల సస్పెన్షన్ బాధాకరం

తన ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు పాల్గొన్నారంటూ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి టీడీపీ నేతలు ఫిర్యాదు చేయడం, 23 మంది వలంటీర్లను సస్పెండ్ చేయడం చాలా బాధాకరమని భరత్‌రామ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఎన్నికల అధికారులు పునరాలోచన చేయాలని కోరారు. ప్రజలను తాను ఓటు అడగడం తప్పన్నట్టు టీడీపీ నేతలు చిత్రీకరించడం దారుణమన్నారు. పని గట్టుకుని ఇళ్లకు వెళ్లి తనకు మద్దతుగా ప్రచారం చేస్తే మార్గదర్శకాలు ఉల్లంఘించినట్టవుతుందని, కానీ, తాను ఓట్లు అభ్యర్థించడం నేరం కాదని అన్నారు. ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత హిందూపూర్ నియోజకవర్గంలో బాలకృష్ణ పేరిట చీరలు పంపిణీ చేశారని, అది ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలు ఉల్లంఘించినట్లేనని, ఎలక్షన్ కమిషన్ చర్య తీసుకోవాలని అన్నారు. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఒకే రోజు 25 వేల కుటుంబాలకు ఇళ్ల పట్టాలిస్తే జీర్ణించుకోలేని ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి వాసులు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని భరత్‌రామ్ మండిపడ్డారు.

సత్యదేవునికి ఘనంగా జన్మనక్షత్ర పూజలు



ఆయుష్య హోమం పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: జన్మనక్షత్రం మఖ సందర్భంగా సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి, శంకరుల మూలవిరాట్టులకు శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆయుష్య హోమం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున రెండు గంటలకు ఆలయాన్ని తెరచి, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సత్యదేవుడు, అమ్మవారు, శంకరుల మూలవిరాట్టులకు పంచామృతాలతో మహన్యాసపూర్వక అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను స్వర్ణాభరణాలు, పట్టువస్త్రాలతో అలంకరించి, భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ యాగశాలలో స్వామివారికి ఆయుష్య హోమం ఘనంగా నిర్వహించారు. హోమం అనంతరం హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు.

క్లుప్తంగా

మూడు కేసుల్లో నిందితుడి అరెస్ట్

బంగారు నగలు స్వాధీనం



నిందితుడిని పట్టుకున్న జీఆర్పీ పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ: రైళ్లలో నేరాలకు పాల్పడుతున్న అంబేడ్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట గ్రామానికి చెందిన అన్నెం వీర శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి సుమారు 2.7 లక్షల విలువైన 28.7 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం రాజమహేంద్రవరం జీఆర్పీ ఎస్ఐ లోవరాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మూడు కేసుల్లో బంగారంతో పాటు రెండు ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకుని నిందితుణ్ణి విజయవాడ రైల్వే కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

తనిఖీల్లో రూ.9.75 లక్షల నగదు స్వాధీనం



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ కృష్ణమోహన్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు

అల్లవరం: ఎన్నికల కోడ్ నేపథ్యంలో లాంటి ఆధారాలు లేకుండా రవాణా అవుతున్న రూ.9.75 లక్షల నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. అల్లవరం మండల పరిషత్ అధికారులు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో కొమరగిరిపట్నం వైపుగా వస్తున్న కారు డిక్కీలో రూ.9.75 లక్షల నగదుని గుర్తించారు. ఈ నగదుని తరలిస్తున్న విద్దిన వెంకట సత్యనారాయణ సరైన ఆధారాలు చూపకపోవడంతో నగదుని అధికారులు స్వాధీనం చేసుకుని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై డీఆర్‌డీఓ పీడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ సమక్షంలో విచారణ చేసి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారని ఎంపీడీఓ కృష్ణమోహన్ చెప్పారు. ఈ సోదాల్లో తహసీల్దార్ సునీల్‌కుమార్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఏడుకొండలు, సిబ్బంది పాల్గొన్నారు.

హోలీ.. ఆనంద కేళి

- నంబరాలకు పిల్లలు, పెద్దలు సన్నద్ధం
- జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యకరం
- రసాయన రంగులకు దూరంగా ఉంటే మేలు
- అతి చేస్తే కంటికి ముప్పు
- సోమవారం వసంతోత్సవం



కొమరిపాలెంలో హోలీ జరుపుకొంటున్న పిల్లలు

బిక్కవోలు: ఫాల్గుణ మాసం పౌర్ణమి. లేలేత చిగుళ్లు, విరబూసిన పూరెమ్మలు, చెట్ల వసంత రాగం ఆలపిస్తున్న తరుణంలో వయోభేదాలకు అతీతంగా ఆనందోత్సాహాలతో జరుపుకునే పండగ హోలీ. పురాణ ప్రాశస్త్యం కలిగిన ఈ పండగను ముఖ్యంగా ఉత్తర భారతీయులు ఎంతో అట్టహాసంగా జరుపుకుంటారు. ఇప్పుడు అన్ని ప్రాంతాల్లోనూ ఈ పండగను ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. పిల్లా పెద్దా తేడా లేకుండా రంగులు పులుముకుంటూ ఆనంద సాగరంలో మునిగితేలుతారు. ఈ వసంతోత్సవాన్ని సోమవారం జరుపుకోనున్నారు.

పురాణ కథ: హోలీ పండగ వెనుక పురాణ కథ ఉంది. హోలీ అనే రాక్షసి పసిపిల్లల ప్రాణాలు హరిస్తూ కడుపు నింపుకునేది. బిడ్డల తల్లిదండ్రులు గర్భశోకంతో ఆగ్రహించి మూకుమ్మడిగా ఆ రాక్షసిని అంతమొందిస్తారు. హోలీ మరణించడంతో ఈ సందర్భాన్ని హోలీగా నిర్వహిస్తారనేది ఒక కథనం.

ఆరోగ్యదాయకం

ఒకప్పుడు సహజమైన రంగులనే వేడుకల్లో వాడేవారు. పండగకు ఒకరోజు ముందు అడవికి వెళ్లి మోదుగు పూలు సేకరించేవారు. వాటిని ఉడికించగా వచ్చే ఎర్రని ద్రావణంలో పసుపు, కుంకుమ కలిపి ఒకరిపై ఒకరు చల్లుకుంటూ సంబరాలు జరుపుకునే వారు. కాల క్రమంలో ఆ రంగులపోయి వార్నిష్, సింథటిక్ రంగులను చల్లుకుంటున్నారు. అవి ప్రమాదకరమని తెలిసినా వాడుతున్నారు. అయితే హోలీ ఆడటంలో కూడాజాగ్రత్తలు తీసుకోక తప్పదని చర్మ వ్యాధుల నిపుణులు సూచిస్తున్నారు. రసాయన రంగులను కాకుండా సహజసిద్ధమైన రంగులతో హోలీ జరుపుకోవడం ద్వారా చర్మానికి హాని జరగకుండా చూసుకోవాలని చెబుతున్నారు.

ఈ సూచనలు పాటిస్తే మేలు

- రసాయన రంగులైన లెడ్ ఆక్సైడ్, అల్యూమినియం, బ్రొమైడ్, మెర్క్యూరీ సల్ఫేట్ వంటివి వాడకూడదు. అవి కళ్లలో పడితే, చూపు పోయే ప్రమాదం ఉంది.
- గులాల్ వంటి రంగులతో ఆస్తమా, చర్మ సంబంధిత వ్యాధులు వస్తాయి.

చిన్న పిల్లలను రంగులకు దూరంగా ఉంచాలి



చాలామంది సరదా కోసం హోలీ పండగలో చిన్నపిల్లలను కూడా ఉండేలా చేస్తారు. కాని చిన్న పిల్లలను దూరం చేయాలి.రంగులవారి మీద పడితే కంటి సమస్యలు, చర్మవ్యాధులు, రంగులు నోటులోకి వెళ్లే ప్రమాదం ఉంటుంది కనుక వారిని జాగ్రత్తగా చూడాలి.

– పులగం రామానందసాగర్, వైద్యులు, అనపర్తి

- రసాయనాలు కలసిన రంగులతో హోలీ ఆడితే వాటిని శరీరంపై ఎక్కువ సమయం ఉండనీయకూడదు. వెంటనే చల్లని నీటితో శరీరాన్ని శుభ్రం చేసుకోవాలి.
- ఎరుపు, పింక్ రంగులనే హోలీ కోసం వాడాలి. ఇవి తక్కువ గాఢత కలిగి ఉండటం వల్ల శరరంపై నుంచి సులభంగా తొలగిపోతాయి. గ్రీన్, ఎల్లో, ఆరంజ్ రంగులు ఎక్కువ రసాయనాలను కలిగి ఉన్న కారణంగా సులభంగా శరీరంపై నుంచి తొలగిపోవు.
- హోలీ ఆడటానికి ముందు శరీరానికి మాయిశ్చరైజర్‌ని, తలకు నూనెను రాసుకోవాలి. దీని వల్ల రంగులు శరీరంలోకి ఇంకవు. రంగులను శుభ్రం చేయడం కూడా సులభమవుతుంది.
- ముఖంపై పడిన రంగులను శుభ్రం చేసుకోవడానికి సబ్బు కన్నా క్లెన్సింగ్ మిల్క్ ఉత్తమమైనది.
- రంగుల్లో వివిధ ఆయిల్స్ కలుపుతారు. ఈ కారణంగా రంగులను శుభ్రం చేయడానికి ఎక్కువ నీరు అవసరమవుతుంది. అందుకే రంగుల్లో ఎటువంటి ఆయిల్స్ లేదా నీటిని కలపకుండా హోలీ ఆడితే నీటి వృథాను అడ్డుకోవచ్చు.

జంట హత్యల కేసులో నిందితుడి అరెస్టు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో జంట హత్యల కేసులో నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసినట్లు గొల్లప్రోలు ఎస్సై బాలాజీ తెలిపారు. వివాహేతర సంబంధం కారణంగా చేబ్రోలుకు చెందిన పెండ్యాల లోవమ్మ గత కొన్నేళ్లుగా తన భర్తను వదిలేసి స్థానికుడైన లోకా నాగబాబుతో కలిసి సహజీవనం చేస్తోంది. అయితే ఇటీవల మరో స్థానిక వ్యక్తి అయిన పోసిన శ్రీనువాసుతో ఆమె వివాహేతర సంబంధం కొనసాగించింది. విషయం తెలుసుకున్న ప్రియుడు నాగబాబు వారిద్దరిని హెచ్చరించాడు. వారు లెక్క చేయలేదు. దీంతో వారిని హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. గత బుధవారం ఉదయం శ్రీనువాసు లోవమ్మతో కలిసి చేబ్రోలు శివారు లక్ష్మీపురం పొలిమేరల్లో ఉన్న తన పొలంలోకి వెళ్లాడు. అప్పటికే అక్కడ మాటు వేసి ఉన్న నాగబాబు వారిపై కత్తితో దాడి చేశాడు. దీంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. అక్కడి నుంచి అదే ఆయుధంతో వచ్చిన నాగబాబు లోవమ్మ ఇంటి వద్ద ఉన్న ఆమె తల్లి రామలక్ష్మిపై దాడి చేసి ఆయుధంతో సహా పరారయ్యాడు. తీవ్ర గాయాలైన రామలక్ష్మిని పోలీసులు అంబులెన్సులో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. ఈ నేపథ్యంలో నాలుగు ప్రత్యేక బృందాలతో గాలించి గురువారం మధ్యాహ్నం గొల్లప్రోలులో అరెస్టు చేసి శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

తప్పుడు ప్రచారం నమ్మొద్దు

- బాధితులకు న్యాయం చేస్తాం
- జయలక్ష్మి సొసైటీ చైర్మన్ త్రినాథరావు
- ఇప్పటి వరకు సాధించిన పురోగతిపై వివరణ



మీడియాతో మాట్లాడుతున్న చైర్మన్ త్రినాథరావు. చిత్రంలో డైరెక్టర్లు సుబ్బారావు, గౌరీశేఖర్

కాకినాడ రూరల్: జయలక్ష్మి సొసైటీ ద్వారా బాధితులకు న్యాయం చేసేందుకు తమ పాలకవర్గం పనిచేస్తుందని విశ్వాసం ఉంచాలని చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు కోరారు. సర్పవరం జంక్షన్ వద్ద మెయిన్ బ్రాంచ్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో ఒకరు, అమలాపురం నుంచి ఒకరు ఇష్టం వచ్చినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, తెలిసీ తెలియని అసత్యాలు పలికితే తాము తీసుకోబోయే చర్యలకు బాధ్యులవుతారని ఆయన హెచ్చరించారు. బాధితులకు అండగా తాము సాధించిన పురోగతని వివరించారు. జయలక్ష్మి ఎంఏఎం కోఆపరేటివ్ సొసైటీ గత పాలకవర్గం 2022 ఏప్రిల్ 6న బోర్డు తిప్పేసిందన్నారు. 29 బ్రాంచ్‌లు సుమారు 20వేల మంది సభ్యులు గల సొసైటీ ద్వారా సుమారు రూ.520 కోట్లు దోచుకుందన్నారు. దీనిపై దర్యాప్తు రాష్ట్ర ప్రభుత్వం సీఐడీకి అప్పగించినట్టు చెప్పారు. విచారణ చేసి డిపాజిట్లను దుర్వినియోగం చేసిన డైరెక్టర్లు, బకాయిలు ఎగొట్టిన రుణ గ్రహీతలపై కేసులు నమోదు చేసి సుమారు రూ.300 కోట్ల విలువైన ఆస్తులను సీజ్ చేశారన్నారు. వాటితో పాటు మరో రూ.200 కోట్ల ఆస్తుల జప్తునకు ప్రతిపాదన చేసిందన్నారు. సదరు ఆస్తులకు న్యాయస్థానం ద్వారా ఉత్తర్వులు పొంది వేలం ద్వారా విక్రయించగలిగితే డిపాజిట్‌దారులకు సొమ్ము చెల్లించవచ్చన్నారు. ఇప్పటికి 50మంది బాధితులు చనిపోయారని, మరో 50 మంది తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు త్రినాథరావు తెలియజేశారు. డిపాజిట్‌దారులకు సత్వర న్యాయం కోసం ప్రభుత్వానికి తాము ఒక ప్రతిపాదన చేశామన్నారు. సీఐడీ సీజ్ చేసిన రూ.300 కోట్లలో సుమారు 30 శాతం నిధులను అప్పుగా సమకూర్చాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి మార్చి 14న దృష్టికి తీసుకువెళ్లామన్నారు. తద్వారా బాధితులకు కొద్ది మేర న్యాయం చేసే వీలవుతుందని, ఈలోగా ఆస్తులు విక్రయానికి కోర్టు అనుమతి లభిస్తే బాధితులకు పూర్తిగా న్యాయం జరుగుతుందన్నారు. సీఐడీ తన పని తాను చేస్తుందని ఈ నెల 11, 12తేదీలలో హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఆకెళ్ళ ఉదయ్‌శంకర్‌కు చెందిన ఆస్తులు సీజ్ చేశారని, కందుల ప్రసాద్‌గుప్తాను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారన్నారు. 14న రాజమహేంద్రవరంలోని హరిపురం బ్రాంచ్ తాళాలను అప్పగించారని, త్వరలో బ్రాంచ్ కార్యాలయం ప్రారంభిస్తామన్నారు. పొన్నాడ గ్రామంలో స్వాధీనం చేసుకున్న భూమిని సొసైటీ పేరున నమోదు చేయడానికి తహశీల్దారుకు కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారన్నారు. సవితాల చక్రభాస్కరరావు ఆస్తులు సీజ్ చేశామని, రాయవరపు జయదేవమణి, ఆంజనేయులు ఆస్తుల వద్ద హెచ్చరిక బోర్డులు పెడుతున్నట్టు తెలిపారు. తమ పాలకవర్గం ఏ పార్టీకి లొంగి పనిచేయదని, సహకారం కోరుతామని, డిపాజిటర్లు ఈ విషయం గ్రహించాలని, బాధితులందరూ ఏకతాటిపై ఉండాలన్నారు. సమావేశంలో డైరెక్టరు చింతా సుబ్బారావు, గౌరీశేఖర్ పాల్గొన్నారు.

రెండు పొగాకు బ్యారన్లు దగ్ధం

సుమారు రూ.7లక్షల నష్టం



దగ్ధమవుతున్న పొగాకు బ్యారన్లు

గోపాలపురం: మండలంలోని దొండపూడిలో రెండు పొగాకు బ్యారన్లు అగ్నికి ఆహుతయ్యాయి. కొవ్వూరు అగ్నిమాపక అధికారి కె.రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం తెల్లవారు జామున పొగాకు క్యూరింగ్ జరుగుతున్న సమయంలో బ్యారన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో దొండపూడి గ్రామానికి చెందిన మద్దాలస్వాతికి చెందిన పొగాకు బ్యారన్ పూర్తిగా కాలిపోయింది. పక్కన ఉన్న పెనుబోతుల నాగజ్యోతికి చెందిన పొగాకు బ్యారన్‌కు మంటలు వ్యాపించడంతో పాక్షికంగా కాలింది. నష్టం విలువ సుమారు రూ.7లక్షలు ఉంటుంది. దీనిపై పొగాకు బోర్డు సిబ్బంది వివరాల నమోదు చేసినట్లు రైతులు తెలిపారు.

విపత్తు నిర్వహణ శాఖ ప్రాజెక్టు మేనేజర్‌గా లావణ్య



కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాద పూర్వకంగా కలిసిన విపత్తు నిర్వహణ శాఖ ప్రాజెక్టు మేనేజర్ లావణ్య

కాకినాడ సిటీ: సాధారణ బదిలీల్లో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ ఆర్డీవోగా పని చేస్తూ బదిలీపై జిల్లా విపత్తు నిర్వహణ శాఖ ప్రాజెక్టు మేనేజర్‌గా మందుల లావణ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను, జేసీ రామ్‌సుందర్‌రెడ్డిని, డీఆర్వో తిప్పేనాయక్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు.

22 కిలోల గంజాయితో ఇద్దరు మహిళల అరెస్టు



గంజాయితో పోలీసులకు చిక్కిన మహిళలు

రాజానగరం: ఎన్నికల సమయంలో గంజాయి అక్రమ రవాణా కూడా అధికమవుతోంది. పురుషులే కాకుండా మహిళలు కూడా ఈ దందాలో భాగస్వాములవుతున్నారు. ప్రయాణికుల మాదిరిగా టిప్‌టాప్‌గా తయారై, ట్రాలీ బ్యాగులేసుకుని మరీ గంజాయిని రవాణా చేస్తున్నారు. ఈ విధంగా అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి నుంచి చెన్నైకి గంజాయిని తీసుకువెళ్లే ప్రయత్నం చేసిన ఇద్దరు మహిళలు శుక్రవారం రాజానగరంలో స్థానిక పోలీసులకు చిక్కారు. ఈ ఘటనకు సంబంధించి స్థానిక సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపిన వివరాలిలావున్నాయి. జాతీయ రహదారిపై తూర్పుగానుగూడెం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద యథావిధిగా తనిఖీలు నిర్వహిస్తుండగా రూ.2.10 లక్షలు విలువ చేసే 22 కిలోల గంజాయితో సహా ఇద్దరు మహిళలు పట్టుబడ్డారు. ట్రాలీ బ్యాగ్‌లలో గంజాయిని లోడు చేసుకుని ఆర్టీసీ బస్సులో ప్రయాణికుల మాదిరిగా వస్తున్న ఆ మహిళలు చెక్‌పోస్టు వద్ద పోలీసులను చూసి, బస్సు దిగి పారిపోయే ప్రయత్నం చేశారు. దీంతో అనుమానంతో సోదా చేయగా వారి వద్ద గంజాయి దొరికింది. ఆరా తీస్తే తడబాటు సమాధానాలివ్వడంతో వారిద్దరినీ అరెస్టు చేసి, గంజాయిని స్వాధీన పర్చుకున్నామని సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు. పట్టుబడిన ఇద్దరు మహిళలలో తాంబెల్లి లక్ష్మి (36) చింతపల్లి మండలం, లోగట్టు అన్నవరం పంచాయతీ పరిధిలోని కట్టుగకు చెందిన వారు కాగా రెండో మహిళ దిప్పల రాధ (38) కొమ్మంగి పంచాయతీ పరిధిలోని చినకొత్తవీధికి చెందినది. ఈ మహిళలు గంజాయి అక్రమ రవాణా చేయడానికి గల కారణాలు ఏమిటి, దాని వెనుక ఎవరు ఉన్నారు, ఎంతకాలం నుంచి ఈ దందా సాగుతుందనే వివరాలను సేకరించే పనిలో ఉన్నామని సీఐ తెలిపారు.

యువకుల పట్టివేత



గంజాయి ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఎస్సై రామకృష్ణ

గండేపల్లి: మోటార్ సైకిల్‌పై గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను అరెస్ట్ చేసినట్టు గండేపల్లి ఎస్సై ఎస్.రామకృష్ణ తెలిపారు. ఆయన వివరాల మేరకు జగ్గంపేటకు చెందిన కాపవరపు బాలాజీ అతని స్నేహితుడు నైనపు వెంకట సురేష్ కలిసి విశాఖ ఏజెన్సీ ప్రాంతమైన ధారకొండ నుంచి రూ.1.15 లక్షల విలువ గల సుమారు 23 కేజీల గంజాయిని తీసుకువస్తున్నారు. పది ప్యాకెట్లను రెండు బ్యాగ్‌లలో సర్దుకొని మోటార్ సైకిల్‌పై గోకవరం మీదుగా రాజానగరం నుంచి జగ్గంపేట వస్తుండగా పట్టుకున్నారు. మండలంలోని మురారి శివారు అంతర్ జిల్లా పోలీస్ చెక్ పోస్టు వద్దకు వచ్చేసరికి ముందస్తు సమాచారం మేరకు పోలీసులు వాహనాల తనిఖీ వీరిని గుర్తించారు. జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు ఆధ్వర్యంలో వీరిని, గంజాయిని, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి రిమాండ్ నిమిత్తం పెద్దాపురం కోర్టుకు తరలించినట్టు తెలిపారు.

యువతా మేలుకో..

ఓటరుగా దరఖాస్తుకు ఏప్రిల్ 15 చివరి తేదీ



రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికల నగారా మోగింది. ఎన్నికల రోజు ఓటు వేయాలి అంటే ముందుగా మీరు ఓటరుగా నమోదు చేసుకుని ఉండాలి. ఓటరుగా నమోదు చేసుకుని ఉన్నా తుది ఓటరు జాబితాలో మీ పేరు లేకుంటే ఓటు వేసేందుకు అనర్హులు. ఇలాంటి వారి కోసమే కేంద్ర ఎన్నికల సంఘం చివరి అవకాశం కల్పించింది. తుది ఓటరు జాబితాలో పేరు లేని వారు, ఏప్రిల్ 1వతేదీ నాటికి 18ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. అర్హులైన వారు 15వ తేదీలోపు ఓటరుగా దరఖాస్తు చేసుకుంటే సంబంధిత అధికారులు దరఖాస్తుదారుల వివరాలను పరిశీలించి, అన్ని వివరాలు సక్రమంగా ఉంటే తుది ఓటరు జాబితాలో పేరును చేరుస్తారు.

ఆన్‌లైన్‌లో...

ముందుగా డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ.ఎన్‌వీఎస్‌పీ.ఇన్ వెబ్‌సైట్‌లో మీ ఫోన్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకుని లాగిన్ అవ్వాలి. న్యూ స్టేటస్ ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. ఆన్‌లైన్ దరఖాస్తులోని వివరాల ఆధారంగా బూత్ స్థాయి అధికారి మీ అడ్రస్‌కు వచ్చి మీ వివరాలను పరిశీలించి, నిర్ధారించుకున్న తర్వాత ఓటరు జాబితాలో మీ పేరు చేరుస్తారు. అలాగే హెచ్‌టీటీపీఎస్//ఓటరు పోర్టల్.ఈసీఐ. జీవోవీ. ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీ ఫోన్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకోవాలి. లాగిన్ అయ్యాక వెబ్‌సైట్‌లో న్యూ ఓటర్ రిజిస్ట్రేషన్‌లోకి వెళ్లి వివరాలు పొందుపరిస్తే నిర్ధారించుకున్నాక మీపేరు ఓటరు జాబితాలో చేరుస్తారు. మొబైల్‌లో ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆఫ్‌లైన్‌లో ఇలా...

18ఏళ్లు నిండి ఓటరుగా మీకు అర్హత ఉంటే ఆఫ్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. బూత్ లెవెల్ ఆఫీసర్(బీఎల్‌వో)లకు మీరు నేరుగా ఫాం-6 దరఖాస్తులు అందజేయొచ్చు. మండల స్థాయిలో అయితే తహసీల్దార్ కార్యాలయాల్లో కొత్త ఓటరు కోసం పూర్తి చేసిన దరఖాస్తులను అందజేయొచ్చు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తరువాత మాత్రమే మీ పేరును ఓటరు జాబితాలో చేరుస్తారు. ఓటు హక్కు ఎలా చేసుకోవాలి లేదా ఇంకేమైనా సందేహాలుంటే టోల్ ఫ్రీ నంబర్ 1950కి ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చు.

పురుగు మందుల షాపులో విజిలెన్స్ తనిఖీలు



గంజాయి ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఎస్సై రామకృష్ణ

కడియం: మండలంలోని దుళ్ళలో పురుగు మందుల షాపును విజిలెన్స్ సిబ్బంది శుక్రవారం తనిఖీ చేశారు. రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ కె.ఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి నేతృత్వంలో విజిలెన్స్, వ్యవసాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఈ తనిఖీలు సాగాయి. గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరరావు ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, అగ్రికల్చర్ ఇన్‌పుట్ అవుట్ లెట్‌లో తనిఖీలు చేపట్టారు. ఎరువుల స్టాక్ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించనట్లు గుర్తించారు. బిల్లులపై రైతుల సంతకాలు తీసుకోలేకపోవడం, స్టాక్ బోర్డు అప్డేట్ చేయకపోవడం వంటి ఉల్లంఘనలు గుర్తించారు. షాపు యజమానిపై 6ఏ కేసు నమోదు చేయాల్సిందిగా వ్యవసాయశాఖాధికారి కె.ద్వారకాదేవిని ఆదేశించారు. రూ. 1,08,331 విలువైన 3.5 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు. రూ.6,63,382 విలువైన 31.40 కేజీలు, 238.60 లీటర్ల పురుగు మందుల అమ్మకాలను 21 రోజులపాటు నిలిపివేస్తూ ఆదేశాలు జారీచేశారు. తనిఖీలలో విజిలెన్స్ అధికారులు ముత్యాలునాయుడు, భార్గవ మహేష్, మండల వ్యవసాయ అధికారి ద్వారకాదేవి, ఏఈవో సంధ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



13వ తేదీన అపస్మారక స్థితిలో రోడ్డు పక్కన పడి ఉన్నప్పటి చిత్రం

కిర్లంపూడి: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతిపై శుక్రవారం స్టేషన్‌లో కేసు నమోదైనట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల్లోకి వెళితే..ఈ నెల 13న మండల పరిధి సోమవరంలోని రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో వ్యక్తి పడి ఉన్నాడు. దీనిని గమనించిన పారిశుధ్య కార్మికుడు స్థానిక వీఆర్వో వెల్లా రాముడు, సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో మృతుడుని అంబులెన్స్‌లో ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతుడి వయసు 50 ఏళ్లు, జిబిరి గెడ్డం, ఎరుపు తెలుపు కలిగిన చారల షర్టు, మాసిన లుంగీ ధరించాడు. సదరు వ్యక్తి బంధువులు ఎవరైనా ఉంటే 94407 96529, 94409 04834 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సాక్షి ఫ్యామిలీ
రాజమహేంద్రవరం
శనివారం ॥ 23-3-2024





పిచ్చుకా క్షేమమా

ఐ లవ్ స్పారోస్!!

మనిషి తన సౌకర్యం కోసం ప్రకృతి సమతుల్యతకు విఘాతం కలిగిస్తూనే ఉంటాడు. ప్రకృతి సహనంతో ఓర్చుకుంటూ, అప్పుడప్పుడూ విలయం రూపంలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉంటుంది. మొత్తంగా తనను తాను సమతుల్యం చేసుకోవడానికి ప్రయత్నం చేస్తూనే ఉంటుంది. 'మాయమైపోతున్నదమ్మ మనిషన్నవాడు'... అని పిచ్చుకలు ఆవేదన చెందుతున్న సమయంలో ప్రకృతిఓ అమ్మాయి మనసును కదిలించింది. ఆమె ఇప్పుడు పక్షి ప్రేమికురాలైంది. తన ఇంటిని పక్షులకు విలాసంగా మార్చింది. తాను పక్షి ప్రేమికురాలిగా మారిన సందర్భాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు మంచాల హరిణి.



హరిణి

అడవికి దాహం వేసింది!

''అప్పుడు నేను బీబీఏ ఫస్ట్ ఇయర్‌లో ఉన్నాను. అమ్మా నాన్న, నేను, అక్క అందరం ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న మా పెద్ద నానమ్మ వాళ్ల ఊరికి వెళ్తున్నాం. నిర్మల్ దాటి కడెం మీదుగా అడవిలో ప్రయాణిస్తున్నాం. మే నెల కావడంతో ఎండ తీవ్రంగా ఉంది. చెట్ల మొదళ్ల ఎండిపోయి వానల కోసం ఎదురు చూస్తున్నాయి. ఓ పక్షి మా కళ్ల ముందే చెట్టుకొమ్మ మీద నుంచి జారి నేల మీద పడింది. కొద్ది సెకన్లపాటు రెక్కలు కొట్టుకున్నాయి. కారాపి వెళ్లి చూశాం, పక్షిని చేతుల్లోకి తీసుకుని మా దగ్గరున్న నీటిని చల్లి, తాగించడానికి ప్రయత్నించాం. కానీ ఆ పక్షి అప్పటికే ప్రాణాలు వదిలేసింది. ఆ చిన్న ప్రాణికి ఎన్ని నీళ్లు కావాలి, ఆ గుక్కెడు నీళ్లు లేకనే కదా ప్రాణం పోయిందని చాలా బాధేసింది. ఆ దృశ్యం పదే పదే కళ్ల ముందు మెదలసాగింది. ఇలాగ ఒక్కో వేసవికి ఎన్ని పక్షులు ప్రాణాలు కోల్పోతున్నాయో కదా... అనిపించింది. ఏదైనా చేయాలనిపించింది. కానీ ఏం చేయాలనేది వెంటనే స్ఫురించ లేదు.

పిచ్చుకలు వచ్చాయి!

పక్షులకు నీటికోసం ఇంటిముందు చిన్న పాత్రలో నీటిని పెట్టడం మొదలు పెట్టాను. పావురాలు ఇతర పక్షుల కంటే పిచ్చుకలే ఎక్కువగా రాసాగాయి. దాంతో పర్మినెంట్ సొల్యూషన్ కోసం ఆలోచిస్తున్నప్పుడు పిచ్చుకల సైజ్‌ని కూడా దృష్టిలో పెట్టుకుని ఫీడర్ బాక్స్ డిజైన్ చేశాను. ఇందుకోసం ఇంటర్‌నెట్‌లో చాలా సెర్చ్ చేశాను. మహారాష్ట్ర, నాసిక్‌లోని ప్లాస్టిక్ వస్తువులను తయారు చేసే ఫ్యాక్టరీ వాళ్లతో మాట్లాడి నాక్కావలసిన డిజైన్‌ను వివరించాను. వాళ్లు రఫ్ తయారు చేసి వాట్సాప్‌లో పంపించేవారు.



'బర్డ్ ఫీడర్ బాక్స్' పంపిణీ చేస్తున్న హరిణి (కుడివైపు)

ప్లాస్టిక్ డబ్బాకు కిటికీల్లాగ ఓపెన్‌గా ఉంచి చిన్న ప్లాస్టిక్ రాడ్‌ను పెట్టించాను. పక్షి ఆ రాడ్ మీద నిలబడి, తెరిచి ఉన్న కిటికీలో ముక్కు పెట్టి గింజలను తింటుంది. నీటి కోసం డబ్బా కింద సాసర్ పెట్టించాను. నాకు సంతృప్తి కలిగే వరకు డిజైన్‌ను మారుస్తూ చేసిచ్చారు వాళ్లు. ఐదేళ్ల కిందట ఇదే తొలి డిజైన్. మొదట వంద పీస్‌లు చేయించి బంధువులు, స్నేహితులకిచ్చాను. తర్వాత అందరూ అడుగుతుండడంతో పెద్ద మొత్తంలో చేయిస్తున్నాం. తాతయ్య పేరుతో 'మంచాల శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్' ద్వారా అందరికీ పంచుతున్నాం. ఒక మంచి పని చేయడం, అది కూడా మా తాతయ్య పేరుతో చేయడం చాలా సంతోషంగా ఉంది. ఇప్పటికి రెండువేలకు పైగా ఇలాంటి డబ్బాలను పంచాను. ఇప్పుడు నేను యూఎస్‌లో పీజీ చేస్తున్నాను. నేను మొదలు పెట్టిన పనిని మా నాన్న కొనసాగిస్తున్నారు. మా చేతిమీదుగా ఈ బర్డ్ ఫీడర్ బాక్స్‌లు అటు ఆదిలాబాద్, నాందేడ్ వరకు, ఇటు హైదరాబాద్, సూర్యాపేట, గుంటూరుకు కూడా చేరాయి. ఈ బాక్స్ కావాలని ఎవరడిగినా వాళ్ల అడ్రస్ పంపిస్తే చాలు కొరియర్ చార్జ్‌లు కూడా మేమే భరించి ఉచితంగా పంపిస్తాం. వంద మాటలు చెప్పడం కంటే ఒక మంచి పని చేయడం మేలని నమ్ముతాను. ఐదేళ్ల నుంచి ఈ పని చేస్తున్నప్పటికీ నేను ఎక్కడా ప్రచారం చేసుకోలేదు. ఐ లవ్ స్పారోస్ అనేది ఈ ఏడాది వరల్డ్ స్పారో డే (మార్చి 20)సందర్భంగా ప్రపంచం ఇచ్చిన పిలుపు. కానీ నేను పిచ్చుకలను ప్రేమించడం ఎప్పుడో మొదలైంది. నేను అందరినీ కోరుకునేది ఒక్కటే. ఆ చిన్న ప్రాణుల కోసం రోజూ ఓ లీటరు నీటిని పెడదాం'' అన్నారు మంచాల హరిణి.

– వాకా మంజులారెడ్డి

చుక్క నీరుంటే చాలు!

గుప్పెట్లో పట్టుకుంటే నిండా గుప్పెడంత కూడా ఉండదు. పిచ్చుకంత ప్రాణం. రేడియేషన్ బారిన పడి అల్లాడిపోతోంది. అభివృద్ధి పేరుతో మనిషి చేసే అరాచకానికి భయపడిపోతోంది. మనిషి కంటపడకుండా పారిపోతోంది. ఏకంగా ఈ భూమ్మీద నుంచే మాయమైపోదామనుకుంటోంది. మనసున్న మనిషి కరవైన నేల మీద తనకు మనుగడ లేదని ఊరు వదిలి పారిపోయింది. అడవుల బాట పట్టి ఏ చెట్టుకొమ్మనో తనను తాను దాచుకుంటూ నీటిచుక్క కోసం వెతుక్కుంటోంది. మనిషి మనసులో ఆర్ద్రత, గుండెలో తడి ఉందని తెలిసిన పిచ్చుక మళ్లీ రెక్కలు టపటపలాడిస్తోంది. వందలాది బంధుగణంతో నిజామాబాద్‌లో మంచాల హరిణి ఇంటి ముందు కొలువుదీరింది. ఈ మాత్రం ఆలంబన దొరికితే చాలు... కిచకిచలతో ఊరంతటికీ వీనులవిందు చేస్తానంటోంది పిచ్చుక.

బ్యూటిప్స్

పార్లర్‌తో పని లేదు...

పార్లర్‌లో ఫేషియల్‌తో పనిలేకుండా, ఖరీదైన క్రీములు కొనకుండా ముఖం చక్కగా మెరవాలంటే ఇంట్లోనే టొమాటో ఫేషియల్‌ను ప్రయత్నించండి. పెళ్లికూతురులా మెరిసిపోతారు.

- టొమాటోను గుండ్రని ముక్కలుగా కోయాలి. ఒక ముక్కను తీసుకుని పైన టీస్పూను పంచదార, టీస్పూను కాఫీ పొడి వేసి ముఖంపైన అద్దాలి. తరువాత చేతులతో సున్నితంగా మర్దన చేసి కడిగేయాలి.
- ఇప్పుడు మరో టొమాటో ముక్కపై టీస్పూను అలోవెరా జెల్ వేసి ఐదు నిమిషాలు మర్దన చేయాలి. ఈ మర్దన అయిన వెంటనే మరో టొమాటో ముక్కపై రెండు టీస్పూన్ల పసుపు వేసి ఐదు నిమిషాలు మర్దన చేయాలి.
- పసుపు పూర్తిగా ఆరాక నీటితో కడిగేసి, తడి లేకుండా తుడిచి మాయిశ్చరైజర్ రాసుకోవాలి. ఈ టొమాటో ఫేషియల్‌లోని ప్రతి స్టెప్‌ను జాగ్రత్తగా అనుసరిస్తే ముఖం కాంతిమంతంగా మెరిసిపోతుంది.
- అరటిపండు గుజ్జులో కొద్దిగా కొబ్బరినూనె వేసి కలిపి ముఖానికి పట్టించాలి. ఇరవై నిమిషాల తరువాత మర్దన చేసి నీటితో కడిగేయాలి. ఇది మంచి క్లెన్సర్‌గా పనిచేయడమేగాక, చర్మానికి తేమనందిస్తుంది.





చిరుతలు

**ధైర్యంగా ఉండమని చెప్పడం అందరూ చేసే పనే.
ధైర్యాన్ని ప్రదర్శించడం కొందరు చేసేది.
ప్రమాదంలోనూ ధైర్యాన్ని చూపడం అతి కొద్ది మందే చేస్తారు.
ఆ అతి కొద్దిమందిలోనూ మేటిగా నిలుస్తున్నారు
హైదరాబాద్‌లోని బేగంపేట వాసులైన ఈ తల్లీ కూతుళ్లు.
ఇంట్లోకి అకస్మాత్తుగా చొరబడిన ఆగంతకులపైకి
చిరుతపులుల్లా విరుచుకుపడ్డారు.
మారణాయుధాలతో బెదిరించినా ఆత్మస్థైర్యాన్ని బెదరనివ్వలేదు.
ఇద్దరు దుండగులను తరిమి తరిమి కొట్టిన తల్లి అమిత మెహోత్.
తల్లిని కాపాడుకునేందుకు దుండగులతో వీరోచితంగా పోరాడిన కూతురు బాబీ.**



బాబీ



అమిత, బాబీలను సత్కరిస్తున్న డీసీపీ రోహిణీ ప్రియదర్శిని

దుండగులు ఎలా ఎప్పుడు ఎక్కడ నుంచి వస్తారో, ఎలా దాడి చేస్తారో మనం ఊహించలేం. అకస్మాత్తుగా ఎదురయ్యే ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలో తెలియక ధనాన్నే కాదు ప్రాణాలను సైతం కోల్పోయేవారెందరో. కానీ, ప్రాణాలను కూడా లెక్క చేయకుండా దుండగుల దుశ్చర్యను క్షణమాత్రంలోనే గుర్తించి, ఆ వెంటనే తమ స్థైర్యాన్ని చూపి నేడు ఎంతో మంది ప్రశంసలు అందుకుంటున్నారు అమిత, బాబీ. స్త్రీలు సబలలు అని నిరూపించిన ఈ వనితలు నేడు ఎంతోమందికి ప్రేరణగా నిలుస్తున్నారు.

''ఎప్పుడో ప్రాక్టీస్ చేసిన బాక్సింగ్‌తో పాటు 15 ఏళ్లుగా చేస్తున్న జిమ్ వ్యాయామాలు, వీటికి తోడు మార్షల్ ఆర్ట్స్‌పై అవగాహన.. ఇవన్నీ దుండగులు తుపాకీ గురి పెట్టినా ఏమాత్రం బెదరక ధైర్యంగా నిలబడేలా చేశాయి. దోచుకోవడానికి వచ్చిన వారిని తరిమి కొట్టేలా చేశాయి'' అని తెలిపింది నలభై ఆరేళ్ల అమిత. ఊహించని విధంగా ఆ తల్లీకూతుళ్ల నుంచి ప్రతిఘటన ఎదురవడంతో దుండగులు కాళ్లకు బుద్ధి చెప్పాల్సి వచ్చింది.

కొరియర్ బాయ్స్ వేషంలో..

ఆన్‌లైన్ అమ్మకాలు పెరిగాక కొరియర్ బాయ్స్ మన ఇళ్ల ముందుకు వస్తుంటారు. వారి గురించి మనకేవిధంగానూ తెలియదు. అలాగని, కొరియర్ వారంతా ప్రమాదకారులే అని మనం చెప్పలేం. కానీ, ఒక్కోసారి సమస్య ఈ విధంగానూ మనల్ని పలకరించవచ్చు అని గ్రహించాలి అనడానికి గురువారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటన మన కళ్లకు కడుతుంది. ''మా ఇంటి గుమ్మానికి, ప్రధాన గేటుకు 200 ఫీట్ల దూరం ఉంటుంది. కొరియర్‌బాయ్స్ ఎవరొచ్చినా గేటు బయటనే ఉండి పిలుస్తారు. గురువారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో బ్యాగ్‌తో ఇద్దరు వ్యక్తులు వచ్చారు. ఒకరు హెల్మెట్ ధరించి ఉండగా మరొకరు మాస్క్ ధరించి ఉన్నారు. నేను మొదటి అంతస్తులోనే ఉండి కొరియర్ వివరాలు అడిగాను. అమిత (నా పేరు), ఎన్‌కె జైన్ (నా భర్త) పేర్లు చెప్పి కొరియర్ వచ్చిందని చెప్పారు. అక్కడే ఉండాలని, వచ్చి తీసుకుంటామని చెప్పాను. నేను కిందికి వచ్చేసరికి గేటు లోపలి నుంచి గుమ్మం వద్దకు వచ్చేశారు.

ఎదుర్కొని .. కనిపెట్టి..

బ్యాగ్‌లో నుంచి కొరియర్ పార్శిల్ తీస్తున్నట్లుగా తీసి ఒకరు తపంచా (నాటు తుపాకీ)తో నాపై ఎక్కుపెట్టాడు. మరొకరు నన్ను తోసుకుంటూ లోపలికి వచ్చి కిచెన్‌లో ఉన్న పనిమనిషి మెడపై కత్తి పెట్టాడు. నా అరుపులకు మొదటి అంతస్తులో ఉన్న కుమార్తె కూడా వచ్చింది. మాపై అటాక్ చేస్తుండగా మేం కూడా తిరిగి అటాక్ చేశాం. ఇద్దరం కలిసి ఆ వ్యక్తి చేతులను గట్టిగా పట్టుకుని వెనక్కి తిప్పి, తపంచాను లాగేసుకున్నాం. దీంతో అచేతనుడైన ఆ వ్యక్తి వెంట తెచ్చుకున్న తాళ్లతో మమ్మల్ని కట్టేసేందుకు ప్రయత్నించగా, ఎదురుతిరిగాం. దాదాపు 20 నిమిషాల సేపు ఘర్షణ జరిగింది. చివరకు ఆ వ్యక్తి పారిపోయే ప్రయత్నం చేశాడు. మమ్మల్ని బలవంతంగా తోసుకుంటూ బయటకు వచ్చేసిన వ్యక్తిని పట్టుకునేందుకు మేము ఎంతగానో వెంబడించాం. ఆ వ్యక్తి పారిపోయాడని తెలుసుకుని కిచెన్‌లో ఉన్న మరో వ్యక్తి ఎక్కడ దొరికిపోతాడో అని ఆందోళనపడ్డాం. అతను కూడా పారిపోయేందుకు కత్తితో బెదిరిస్తూ బయటకు వచ్చాడు. మా అరుపులకు ఈ లోగా స్థానికులు రావడంతో అతన్ని పట్టుకోగలిగాం. తెలిసిన వారే అయ్యుంటారని మేం వారు ధరించిన హెల్మెట్, మాస్క్‌ను తీసేయడంతో వారెవరో కనిపెట్టగలిగాం. కిందటేడాది దీపావళి సమయంలో పది రోజులపాటు మా ఇంటి క్లీనింగ్ విషయంలో ఓ ఏజెన్సీని సంప్రదిస్తే, వారు పంపించిన వ్యక్తులే వీళ్లు. మా ఇంటిని క్లీన్ చేసే సమయంలో ఏయే వస్తువులు ఎక్కడ ఉన్నాయో గమనించి, ఇంట్లో ఆడవాళ్లం మాత్రమే ఉండే సమయం చూసి, ఇలా దొంగతనం చేయడానికి ప్లాన్ చేసుకున్నారని తెలిసింది. మేం ఎదురు తిరగడంతో వచ్చిన పని గురించి కాకుండా మేము తమ ముఖాలను చూడకుండా కాపాడుకునేందుకే ఎక్కువ ప్రయత్నం చేశారు.

ఆ ధైర్యం ఎలా వచ్చిందంటే..

గతంలో ఐదేళ్లు బాక్సింగ్ ప్రాక్టీస్ చేశాను. రోజూ జిమ్‌కు వెళ్తుంటాను. మార్షల్ ఆర్ట్స్‌పై కూడా అవగాహన ఉంది. అవే నన్ను ధైర్యంగా ఉండేలా, సాహసం చూపేలా చేశాయి. ఎదురొచ్చిన విపత్తు నుంచి కాపాడేలా చేశాయి. ఒక తపంచా, రెండు కత్తులు, తాళ్ల సహాయంతో వారు మమ్మల్ని లొంగదీసుకునేందుకు చేయని ప్రయత్నమంటూ లేదు. వారి ప్రతి చర్యను తిప్పికొట్టగలిగామంటే బాక్సింగ్, ఫిట్‌నెస్‌లే కారణమని కచ్చితంగా చెప్పగలను'' అని తామ ఎదుర్కొన్న సంఘటనను వివరించారు అమిత.

ఈ తల్లీకూతుళ్లు దుండగులను ధైర్యంగా ఎదుర్కొన్న దృశ్యాలు సీసీటీవీలో రికార్డయ్యాయి. ఈ ఘటన తర్వాత అమిత, ఆమె భర్త, స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

డీసీపీ ప్రశంసలు.. సన్మానం..

అమిత, ఆమె కుమార్తె బాబీ ఇద్దరూ చూపిన ధైర్యసాహసాలు ఆదర్శప్రాయం అని నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. బేగంపేట పైగా కాలనీలోని అమిత నివాసానికి నేరుగా వచ్చిన డీసీపీ అమితతో పాటు ఆమె కుమార్తెనూ ప్రశంసించి, శాలువాతో సత్కరించారు. మైనర్ బాలిక అయినా ఆమె చూపిన తెగువ ఎంతో అభినందనీయమన్నారు.

– కోట కృష్ణారావు, సాక్షి, హైదరాబాద్

ఆత్మరక్షణకై మెలకువలు అవసరం

మహిళలు ఆత్మరక్షణ దిశగా మెలకువలను నేర్చుకోవాలి. ఇప్పుడు నా జీవితంలో ఎదురైన అనుభవం లాగా ఎవరి జీవితాల్లోనూ రాకూడదని కోరుకుంటాను. ఒక వేళ వస్తే మాత్రం అందుకు సిద్ధంగా ఉండాలి. ధైర్యంగా ముందడుగు వేయాలి.

– అమిత



ఇంటిప్స్

సీలింగ్ ఫ్యాన్ ఇలా శుభ్రం

సాధారణంగా సీలింగ్ ఫ్యాన్‌లను ఎక్కువ ఎత్తులో అమర్చుతారు. అందువల్ల వాటిని తరచు శుభ్రం చేయడం చాలా కష్టం. అలాగని నెలల తరబడి అలాగే ఉంచేస్తే మురికి పేరుకుని పోయి అసహ్యంగా కనిపిస్తుంది. అటువంటి పరిస్థితుల్లో పాత పిల్లో కవర్ తీసుకుని టేబుల్ మీద ఎక్కి సీలింగ్ ఫ్యాన్ రెక్కలను కవర్ చేయాలి. కవర్ పైభాగం నుంచి మీ చేతులతో రుద్దాలి. అదేవిధంగా, మూడు రెక్కలను శుభ్రం చేయాలి. మట్టి కూడా కవర్‌లో పడిపోతుంది. ఇది మీ ఇంటిని కూడా మురికిగా చేయదు.

మరో పద్ధతి...

పాత షర్ట్, టీషర్ట్ లేదా ఏదైనా కాటన్ వస్త్రం సహాయంతో ఫ్యాన్‌ను శుభ్రం చేయవచ్చు. ఫ్యాన్ మీద పొడి దుమ్ము ఉంటే.. అది సులభంగా ఒక వస్త్రంతో శుభ్రం చేసుకోవచ్చు. ఒకవేళ వంటగదిలో ఉండే ఫ్యాన్‌ను క్లీన్ చేస్తున్నట్లయితే.. దానిపై నూనె, ధూళి పేరుకుపోయి ఉంటుంది. అటువంటి వాటిని సబ్బుతో కడగడం మంచిది. కాసేపు రెక్కలను స్క్రబ్ చేయాలి.



గుర్తుంచుకోవాల్సింది..

ఫ్యాన్‌ను క్లీన్ చేసినప్పుడల్లా కింద ఒక షీట్ లేదా వస్త్రాన్ని పరచాలి. దీంతో ఫ్యాన్ క్లీన్ అయిన తర్వాత మీకు పని పెరగదు. ఫ్యాన్ మురికి షీట్లో పడిపోతుంది.

ఫ్యాన్ శుభ్రం చేసేటప్పుడు గ్లాసెస్ లేదా సన్‌గ్లాసెస్ ధరించండి. ఇది చెత్తను కంట్లో పడకుండా చేస్తుంది. దీంతో అలర్జీ కూడా రాదు. సీలింగ్ ఫ్యాన్ శుభ్రం చేసేటపుడు ముక్కుకు మాస్క్ లేదా రుమాలు కట్టుకోవాలి.

హోలీ

రంగు పడే ఊళ్లు

తీర్థయాత్రలు చేస్తారు కొందరు. వర్ణయాత్రలు కొందరికి ఇష్టం. మన దేశంలో హోలి చాలా హుషారైన పండగ. బహుశా దీపావళి తర్వాత చిన్నా పెద్దా అందరూ కేరింతలతో పాల్గొనే పండగ ఇదే. రొటీన్ జీవితంలో రంగులను నింపుకోవడం బాగుంటుంది. అయితే కొందరికి ఇంట్లోనో, అపార్ట్‌మెంట్ ప్రాంగణంలోనో, వీధిలో, ఏరియా చౌరస్తాలోనో ఆడే హోలీ పెద్దగా ఆనదు. వారికి భారీ హోలి వేడుక చూడాలనిపిస్తుంది. అలాంటి వారి కోసం హోలి డెస్టినేషన్స్ ఉన్నాయి. మన దేశంలో. ఈ హోలీకి వెళ్లగలిగితే వెళ్లండి.

మథుర:

ఉత్తరప్రదేశ్‌లోని మథురలో హోలి వేడుకలు చూడటం అంటే కృష్ణ రాధలు ఆడే హోలిని చూసినట్టే. ఇక్కడి బర్సానాలో స్త్రీలు గోపికల్లా, పురుషులు గోపబాలురలా అలంకరించుకుని హోలి ఆడతారు. రంగులు చల్లడానికి వచ్చిన గోపబాలురను స్త్రీలు సరదాగా బడితెలతో బాది దూరం తరుముతారు. అందుకే దీనిని 'లాత్‌మార్ హోలి' అంటారు.





బృందావన్:

ఉత్తరప్రదేశ్‌లోని బృందావన్‌కు వెళితే అక్కడి బన్‌కె బిహారి ఆలయంలో పూలు, రంగులు కలిపి చల్లుకుంటూ కోలాహలంగా హోలి నిర్వహిస్తారు. అందుకే దీనిని 'ఫూల్‌వాలోంకి హోలి' అంటారు. ఇక్కడ ఒకరోజు రెండు రోజులు కాదు... వారం రోజులపాటు హోలి వేడుకలు జరుగుతునే ఉంటాయి. చుట్టుపక్కల పల్లెలు రంగులతో తెల్లారి రంగులతో అస్తమిస్తాయి. ఈ అద్భుతమైన వేడుకలను చూడానికి టూరిస్ట్‌లు వస్తారు.

ఉదయ్‌పూర్:

ఇక రాచరికస్థాయిలో హోలి చూడాలంటే రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు వెళ్లాలి. అక్కడి సిటీ ప్యాలెస్‌లో రాజ వంశీకుల హాజరీలో అద్భుతమైన హోలి వేడుకలు జరుగుతాయి. ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాజస్థానీ జానపద కళల ప్రదర్శన ఉంటుంది. టూరిస్ట్‌లు ఈ వేడుకలు చూడటానికి తెగబడతారు.



హంపి:

తుంగభద్ర నది ఒడ్డున రంగుల పండగ ఎలా ఉంటుందో చూడాలంటే హంపి వెళ్లాలి. ఇక్కడ హంపి సందర్భంగా భారీగా అలంకరించి నిర్వహించే రథయాత్ర చూడటానికి రెండు కళ్లూ చాలవు. ఈ సాంస్కృతిక క్షేత్రంలో హోలీ ఒక విచిత్ర భావన కలిగిస్తుంది. నగర ప్రజలు డోళ్లు మోగిస్తూ హోలి వేడుకల్లో విశేషంగా పాల్గొంటారు. విరూపాక్ష ఆలయం ఈ సందర్భంగా కళకళలాడిపోతుంది. దక్షిణాదివారు హోలీ సెలవు హంపిలో గడిపి ఆనందించవచ్చు.



శాంతినికేతన్:

పశ్చిమ బెంగాల్‌లోని శాంతినికేతన్‌లో హోలి అయితే నయనానందమూ శ్రవణానందమూ కూడా. ఎందుకంటే అక్కడ హోలి అంటే రంగులు చల్లుకోవడం మాత్రమే కాదు... నృత్యాలు, సంగీతం, కవిత్వం... అమ్మాయిలు అబ్బాయిలు కలిసి మనోహరంగా హోలి జరుపుకుంటారు. రవీంద్రనాథ్ ఠాగూర్ మొదలెట్టిన ఈ సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది. ఇక్కడకు వెళ్లి హోలి చూసినవారి హృదయం కచ్చితంగా రంగులతో నిండిపోతుంది.



ఆనంద్‌పూర్ సాహిబ్:

పంజాబ్‌లోని ఈ ఊళ్లో హోలీ రంగులకు కళ్లు చెదురుతాయి. నిహాంగ్ సిక్కులు ఇక్కడ హోలి సమయంలో యుద్ధ విద్యలు ప్రదర్శిస్తారు. ఉత్తుత్తి పోరాటాలు ఇరు జట్ల మధ్య జరుగుతాయి. డోళ్లు తెగ మోగుతాయి. ఆట పాటల అట్టహాసం చూడతగ్గది.

